సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం। 29। జనవరి। 2025



సోమశిలలో 67.702 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 67.702 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1838 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.82,790
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,528
3 శాతం జీఎస్టీతో	రూ.7,754
నవర (8 గ్రా)	రూ.62,032

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.6 /22.2

బుధవారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 56 శాతంగా నమోదైంది.

దగ్గు మందుకూ దిక్కు లేదాయె!





సాక్షి విజిట్

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటే సమాజం ఉన్నతంగా ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. అందుకు తగిన విధంగా డాక్టర్లు, సిబ్బంది ఉండాలని కూడా పేర్కొంది. జిల్లాలోని గ్రామీణ, అర్బన్ పీహెచ్‌సీలలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రాథమిక అవసరాలైన దగ్గు మందు, తుమ్ములు, జలుబుకు వాడే మందులు, షుగర్ మందులతో పాటు పలు రకాల రక్తపరీక్షలు అందుబాటులో లేకుండా పోయాయి. గత ప్రభుత్వంలో మందులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో మందుల కొరత ఏర్పడింది. డాక్టర్లపై పర్యవేక్షణ కొరవడింది. రోగులకు సరైన వైద్యం అందడం లేదు. సాక్షి బృందం విజిట్‌లో మంగళవారం ఈ విషయాలు వెలుగుచూశాయి.

నెల్లూరు(అర్బన్): జిల్లాలో 52 పీహెచ్‌సీలున్నాయి. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, నర్సులు, సిబ్బంది మొత్తం 12 మంది ఉన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు నెల్లూరులో 20, కందుకూరులో 2, కావలిలో 4, ఆత్మకూరులో ఒకటి, బుచ్చిరెడ్డిపాళెంలో ఒకటి ఉన్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక డేటాఎంట్రీ ఆపరేటర్, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక స్వీపర్ కమ్ వాచ్‌మెన్, మరొక కోఆర్డినేటర్ కలిపి 8 మంది ఉంటారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో మంగళవారం పరిశీలన చేయగా నెల్లూరు జేవీఆర్ కాలనీలో షుగర్ పరీక్ష చేయించుకోవాలని ఒక పెద్దామెను ఆమె కుమారుడు బైక్ మీద 8.30 గంటలకు తీసుకుని వచ్చాడు. అప్పటికి గేటు తాళాలు తీయలేదు. 9.05 వరకు వేచి చూడసాగారు. అప్పుడు తాళాలు తీశారు. సాధారణంగా స్వీపర్ ముందుగా వచ్చి 8.30 గంటలకు తాళాలు తీసి గదులు శుభ్రపరచాలి. అలా జరగలేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు అర్బన్ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వర్తించాలి.

- వెంగళరావు నగర్‌లోని యుపీహెచ్‌సీని పరిశీలించగా 8.50 గంటలకు ఫార్మసిస్ట్ వచ్చారు. అంతకు ముందుగానే స్వీపర్ వచ్చి గదులు శుభ్రం చేస్తోంది. డాక్టరమ్మ 9.25 గంటలకు వచ్చారు. వైఎస్సార్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించగా డాక్టర్ 10 గంటలు దాటాక వచ్చారు. గాంధీనగర్‌లో ఉన్న చంద్రమౌళినగర్ పీహెచ్‌సీలో కూడా డాక్టర్ 10 గంటల తర్వాతనే వచ్చారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్లందరూ కాంట్రాక్టు మీద పనిచేస్తున్న వారు కావడంతో వారు రోగుల ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. జేవీఆర్ కాలనీలో రోజులో కేవలం 30 మంది రోగులు మాత్రమే వచ్చారు.

మందులు, రక్తపరీక్షల పరిస్థితి అంతంత మాత్రమే

పట్టణ ఆరోగ్య కేంద్రంలో షుగర్‌కు సంబంధించిన ఇన్సులిన్ హ్యూమన్ మిక్సార్డ్ 30/70 ఇంజక్షన్ లేదు. అంబ్రాక్సల్ లాంటి దగ్గు మందులు లేవు. కొన్ని చోట్ల కామన్‌గా అవసరమయ్యే సిట్రిజిన్ మాత్రలు లేవు. సీజనల్‌గా వచ్చే జ్వరంలో సైతం రక్తకణాలు తగ్గిపోతున్నాయి. రక్తం ఎంత ఉందో తెలుసుకోవాలి. ఇందుకు సీబీపీ రక్త పరీక్ష అవసరం. రియేజంట్స్ అయిపోయాయని సీబీపీ పరీక్ష చేయలేదు. స్టూల్ పరీక్ష చేయడం లేదు. కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్లలో గ్యాస్ట్రైటిస్ రాకుండా ఉండేందుకు, యాంటి బయాటిక్స్ పెట్టినప్పుడు సపోర్టుగా వాడే పాంటాప్రజోల్ టాబ్లెట్స్ కూడా లేవు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కూటమి ప్రభుత్వం సకాలంలో మందులు సరఫరా చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవే పరిస్థితులు జిల్లాలోని 28 అర్బన్‌హెల్త్ సెంటర్లలో ఉన్నాయి.



సోమశిల పీహెచ్‌సీలో డాక్టర్లు లేక వైద్యసేవలు అందిస్తున్న స్టాఫ్ నర్సు

స్టాఫ్ నర్సే ఇక్కడ డాక్టర్

సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో వాళ్లు చేసే పనిని ఓ స్టాఫ్ నర్సు నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం పీహెచ్‌సీకి చెందిన ఇద్దరు డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణిలు హస్పటల్‌కు వచ్చి హాజరు వేసుకుని డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పింఛన్ వెరిఫికేషన్‌కు సంబంధించి వేరే మండలానికి డ్యూటీ వేయడంతో అక్కడకు వెళ్లారు. ఇంకో డాక్టర్ శ్రావణి 104 వాహనం డ్యూటీపై వెళ్లడంతో ఆసుపత్రిలో చివరకు స్టాఫ్ నర్సు దిక్కయింది. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సు వైద్యసేవలు అందించారు. డాక్టర్లు లేరని తెలిసి కొందరు రోగులు నిరాశగా వెనుదిరిగారు.

మందులుండేలా చర్యలు చేపట్టాం

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలలో దాదాపు అన్ని రకాల మందులున్నాయి. అయితే ఒకటి అరా తగ్గితే వాటి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. రోగులకు మందుల కొరత రాకుండా ఉండేందుకు అన్ని రకాల మందులు ఉండేలా చర్యలు చేపట్టాం

– డాక్టర్ వి.సుజాత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి



జేవీఆర్ కాలనీలో ఆరోగ్య కేంద్రాన్ని తెరవకపోవడంతో రక్తపరీక్ష కోసం వచ్చి స్కూటీపై కూర్చుని ఎదురు చూస్తున్న మహిళ



వెంగళరావునగర్‌లోని ఎన్‌జీటీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో హాజరు కాని సిబ్బంది

- సర్వాయపాళెం పీహెచ్‌సీ పరిస్థితి
- జబ్బు చేస్తే కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సిందే

అడవిలా ఉన్న ఆస్పత్రి ప్రాంగణం



సర్వాయపాళెం పీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న వైద్యురాలు



చెట్ల పొదల మధ్య సర్వాయపాళెం పీహెచ్‌సీ ప్రాంగణం

కావలి: కావలి పట్టణ పొలిమేరకు కేవలం మూడు కిలో మీటర్లు దూరంలో సర్వాయపాలెం గ్రామం ఉంది. భౌగోళికంగా ఈ గ్రామం కావలి రూరల్ మండలంలో ఉంది. ఈ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు, 12 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకు వైద్యులు, సిబ్బంది పీహెచ్‌సీకి చేరుకున్నారు. ఒక్క రోగి కూడా రాలేదు. 11 గంటలకు ఇద్దరు వచ్చి షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులను కలిసి ఆరోగ్య సలహాలు తీసుకున్నారు. గ్రామానికి సమీపంలో కావలి పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఉండటంతో రోగాలు సోకితే అక్కడికి పోవడానికే గ్రామస్తులు ప్రాధాన్యం ఇస్తుంటారు.

- సర్వాయపాళెం పీహెచ్‌సీ ఉన్న రోడ్డులో తల్లిని బైక్‌పై కూర్చోపెట్టుకొని కుమారుడు వెళ్తుండగా అతన్ని పలకరిస్తే మా అమ్మకు ఆరోగ్యం బాగా లేకపోతే కావలికి తీసుకెళ్లి వైద్యులకు చూపించుకొని తీసుకొస్తున్నాను అని చెప్పాడు. సర్వాయపాలెం పీహెచ్‌సీ ప్రాంగణంలో అడవిలా ఉంటుంది. దీంతో ప్రాంగణంలోని గుబురు చెట్లు పొదల్లో పందులు, కుక్కలు, పాములు, తేళ్లు వంటివి ఉంటాయి. అక్కడికి వెళ్తే లేని రోగాలు వస్తాయి అని అన్నారు. పీహెచ్‌సీలో బోర్ పనిచేయక మూలపడింది. అలాగే వాటర్ ట్యాంకర్ కూడా శిథిలమైపోయింది. దీంతో ఆస్పత్రిలో నీటి వసతి లేదు.

కరేడులో ఖాళీ కుర్చీలు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయపాలన కరువైంది. ఉదయం 9 గంటలకు వైద్యశాల తీయాల్సి ఉండగా ఆ సమయంలో కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు మాత్రమే హాజరయ్యారు. వైద్యాధికారి శ్రీనివాసరావు 9.50కు ఓపీకి హాజరయ్యారు. మరో వైద్యురాలు రత్నజ్యోతి ఉలవపాడులో జరిగిన 104 వాహన సేవలకు 10 గంటల తరువాత హాజరయ్యారు. మధ్యాహ్నం వరకు 30 మందిని వైద్యుడు శ్రీనివాసరావు పరీక్షించి మందులు అందజేశారు. వైద్యశాల గోడ బయట పారిశుద్యం అధ్వానంగా ఉంది.

కరేడులో 9.30 సమయంలో ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ



కాలుకు దెబ్బ తగిలితే మందులు లేవన్నారు



మాది లింగసముద్రం పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం. నా పేరు మన్నెం ఆదినారాయణ నా కాలికి దెబ్బతగలడంతో చికిత్స కోసం వైద్యశాలకు వచ్చాను. డాక్టర్ పరీక్షించారు. కానీ నొప్పులకు వైద్యశాలలో మందులు లేవని చెప్పారు. మందులను ప్రైవేట్ మందుల షాపులో కొనుగోలు చేశాను.

– మన్నెం ఆదినారాయణ, వాకమళ్లవారిపాళెం, లింగసముద్రం

న్యూస్‌రీల్

ఫీజు చెల్లించేందుకు చివరి అవకాశం

నెల్లూరు(టౌన్): ఈ ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు తాత్కాల్ – 2 కింద రూ.3 వేలు చెల్లించేందుకు బుధవారం వరకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించినట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఫీజు చెల్లించని విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

నీటి వనరులపై జలగణన



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేయడానికి తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి జలగణన ఉపయోగపడుతుందని జేసీ కె.కార్తీక్ అన్నారు. జిల్లాలో ఏడు చిన్న తరహా నీటి వనరుల గణన, 2 జలాశయాల గణనను నిర్వహించేందుకు జిల్లాస్థాయి శిక్షణ మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగింది. దీనిని ప్రారంభించిన జేసీ మాట్లాడుతూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు జరుగుతున్న చిన్న తరహా నీటి వనరులు, జలాశయాల గణనను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ నరసింహారావు, సహాయ సంచాలకులు ఆయేషా, ఎస్‌ఓ శ్యామ్‌కుమార్, వివిధ మండలాల ఏఎస్‌ఓలు పాల్గొన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో థర్మల్ ప్రాజెక్టులో మంగళవారం మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ఇంజినీర్లు తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 540 మెగావాట్లు, 2వ యూనిట్లో 690 మెగావాట్లు, 3వ యూనిట్లో 740 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు.

కార్పొరేషన్ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు): ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన సమీపంలోని నెల్లూరు బిట్–1 గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 140, 141లోని లే అవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం రిజర్వు చేసిన 250 అంకణాల స్థలాన్ని టీడీపీ నేతలు నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించిన విషయంపై ఈనెల 18న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన కార్పొరేషన్ అధికారులు ఆ స్థలం కార్పొరేషన్‌కు చెందినదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

దాడులు, దమనకాండలు ఎల్లకాలం సాగవు



మున్సిపల్ అధికారులు కూల్చివేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భవనాన్ని పరిశీలిస్తున్న కాకాణి, పర్వతరెడ్డి, ఖలీల్ అహ్మద్ తదితరులు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి తదితరులు

- మంత్రి నారాయణ, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కట్టడాల కూల్చివేతే మీ లక్ష్యమా?
- జగన్ హయాంలో మేము తలుచుకుంటే పంట కాలువ మీద నారాయణ మెడికల్ కాలేజీ ఉండేదా
- కిండల్ పడిన వారంతా ప్రభుత్వం మారినప్పుడు కటకటాల పాలవుతారు
- విలేకరులతో మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి హెచ్చరిక

నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విధ్వంసకరమైన పరిపాలనకు శ్రీకారం చుట్టి ప్రతినిత్యం తమ పార్టీ శ్రేణులమీద దాడులు, దమనకాండలు కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బాలాజీనగర్, చీపురుకట్టసంఘం ప్రాంతంలో కార్పొరేషన్ అధికారులు కూల్చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు చెందిన భవనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డితో పాటు పార్టీ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దౌర్జన్యాలకు పరాకాష్టగా తమ పార్టీ కార్యకర్త బాలకృష్ణారెడ్డి ఇంటిని కూల్చివేశారన్నారు. బాలకృష్ణారెడ్డి తండ్రి సుబ్బారెడ్డి 40 సంవత్సరాలుగా ఇదే స్థలంలో నివాసం ఉంటున్నాడని.. అందుకు సంబంధించిన 80 ఏళ్ల డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఇదేమన్నా మీ జాగీరా.. మీ ఇష్ట ప్రకారంగా వ్యవహరించేందు కోసమేనా మిమ్మల్ని ఓట్లేసి గెలిపించింది అని ప్రశ్నించారు. కొంత మంది మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని.. వారంతా కిండల్ పడుతున్నారని ఇది మంచిది కాదని ఇలాగే వ్యవహరిస్తే మాత్రం భవిష్యత్తులో ప్రభుత్వం మారిన తర్వాత కిండల్ పడిన వారంతా కటకటాల పాలవుతారని హెచ్చరించారు. పంట కాలువలకు సంబంధించి వస్తే నారాయణ మెడికల్ కాలేజీ ఉండదన్నారు. ఆ కాలేజీ కింద ఎన్ని పంట కాలువలు పోతున్నాయో ప్రజలకు తెలుసన్నారు. నష్టపోయిన తమ పార్టీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ తరఫున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ విధ్వంసాలకు పాల్పడుతూ అందరినీ భయపెడుతున్నారని అన్నారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించి లే అవుట్లలోని ఇళ్లను కూలదోసి వారిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కక్ష సాధింపులకు దిగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. మీకిది తగునా!

- రెడ్‌క్రాస్‌కు రాజకీయాలతో సంబంధం ఉండకూడదన్నారు
- ఎన్నికల్లో మంత్రి నారాయణ సభల్లో విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు
- మరి.. ఆయనకు రెడ్‌క్రాస్ చైర్మన్ పదవి ఎలా ఇచ్చారు?

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రెడ్‌క్రాస్ అంటే సేవ చేసే సంస్థ అని ఇందులో రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న వారు ఉండకూడదని నిబంధనల పేరిట కలెక్టర్ ఆనంద్ రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్న పర్వతరెడ్డి చంద్రశేకర్‌రెడ్డితో పాటు మరో నలుగురు ఎంసీ మెంబర్లకు నోటీసులు ఇచ్చారు. వారు అందుకు తగిన వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ సంతృప్తి చెందని కలెక్టర్ రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీకి అనుకూలురంటూ ముద్రవేసి మిగతా మేనేజింగ్ కమిటీ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజి సుబ్బారెడ్డి తదితరులను తొలగించడమే కాకుండా ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా తీసేశారు. అయితే కోర్టుకెళ్లి తిరిగి విజయాన్ని సాధించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరులు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రం ఇప్పటికీ రెడ్‌క్రాస్ సభ్యులుగా కొనసాగుతున్నప్పటికీ వారి ప్రాథమిక సభ్యత్వాన్ని కలెక్టర్ రద్దు చేయలేదు.

చట్టబద్ధంగా గెలిచినా..

రెడ్‌క్రాస్‌లో ఉన్న 8వేల ఓట్లలో 6వేల ఓట్లు సాధించి రెడ్‌క్రాస్ చైర్మన్, ఎంసీ పదవులు దక్కించుకున్నప్పటికీ కలెక్టర్ ఆనంద్ వారిని తొలగించారు. మంత్రి అనుచరుడిగా ఉన్న వాకాటి విజయకుమార్‌రెడ్డిని నా విజయానికి నీవు సహకరిస్తే.. నీకు రెడ్‌క్రాస్ చైర్మన్ పదవి కట్టబెడతా.. ఇలా ముందస్తుగా అనుకున్న పథకం ప్రకారమే పదవి వాకాటి విజయకుమార్‌రెడ్డిని వరించిందా అంటే అవుననే విశ్లేషకులు అంటున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేయాలని ప్రత్యక్ష రాజకీయాలు చేసిన వాకాటికి కలెక్టర్ ఆనంద్ రెడ్‌క్రాస్ ఎన్నికల్లో సహకారమందించారనేది నగ్న సత్యం. మంత్రి నారాయణ ఒత్తిడి పెట్టినంత మాత్రాన కలెక్టర్ ఒక పార్టీకి కొమ్ము కాయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





నారాయణతో కలిసి గతంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వాకాటి (వృత్తంలో)

ఈ ఫొటోలో మంత్రి నారాయణ పక్కన ఉన్నది వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి. ఆయన గతంలో ప్రైవేట్ విద్యాసంస్థకు అధిపతిగా ఉండేవారు. తర్వాత విద్యాసంస్థను వదిలేసి నారాయణకు ఆప్తుడయ్యారు. ఆ క్రమంలోనే 2024 ఎన్నికల్లో పలుచోట్ల బహిరంగ సభల్లో నారాయణతో పాల్గొన్నారు. ఫొటోలు దిగారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో మాట్లాడి ఒకచోట సభను పెట్టించారు. ఈ క్రమంలో తన కున్న అనుభవంతో ప్రైవేటు విద్యాసంస్థల వారిని నారాయణకు ఓటు వేసేలా కృషి చేశారు. నారాయణ గెలుపు కోసం వాకాటి విజయకుమార్‌రెడ్డి పాంప్లెట్స్ వేయించారు. వాటిలో తన వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను ప్రింట్ చేయించారు. ఆయన గెలుపు కోసం బహిరంగంగా పని చేశారు.

కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నికయ్యేందుకు సహకరించారు. మరి మంత్రి నారాయణతో ఫొటోలు దిగి ఎన్నికల ప్రచారంలో పాల్గొని, వ్యక్తిగత నంబర్ కూడా పాంప్లెట్స్‌లో ఇచ్చిన వాకాటి విజయకుమార్‌రెడ్డి మాత్రం కలెక్టర్‌కు ఎలా రాజకీయేతరుడుగా కనిపించారో తెలియడం లేదు. పాలకులు వస్తుంటారు.. పోతుంటారు. అధికారులు ఎక్కడికెళ్లినా శాశ్వతం. మరి అలాంటి అధికారులు ఒత్తిడికి తలొగ్గితే ప్రజాస్వామ్యం మనుగడ సాగించడం సందేహమే.

క్లుప్తంగా

రైల్లోంచి జారిపడి యువకుడి మృతి

నెల్లూరు (క్రైమ్): రైల్లోంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం వేదాయపాళెం రైల్వేగేటు సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై జరిగింది. మృతుడికి 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయి. నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీషర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్ఐ జి. మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వవ్వేరులో ఇరువర్గాల మధ్య వివాదం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డు వవ్వేరులో మంగళవారం ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. టీడీపీకి చెందిన చోటా నేత కనిగిరి రిజర్వాయర్ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన భవనాన్ని కాపాడుకునేందుకు గ్రామంలో మత ప్రచారానికి శ్రీకారం చుట్టాడు. తమిళనాడు, నెల్లూరుతోపాటు బుచ్చిరెడ్డిపాళెం నుంచి కొందరిని తీసుకొచ్చాడు. వాళ్లు ప్రతి కూడలి వద్ద మైకుల ద్వారా ప్రచారం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. ఓ మహిళ ఫొటోలు తీస్తుండగా ప్రచారం కోసం వచ్చిన వ్యక్తి ఫోన్ లాక్కున్నాడు. అదే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం నుంచి బీజేపీ నాయకులు రాగా కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చెరువును ఆక్రమించి నిర్మించిన భవనం కోసం మతం ముసుగు వేయడం ఏమిటని నాయకులు నిలదీశారు. దీంతో తమిళనాడు నుంచి వచ్చిన వారు ఈ ప్రాంతానికి రామని చెప్పి వెళ్లిపోయారు.

సరుడు దోపిడీపై పోలీసులకు ఫిర్యాదు

సంగం: తన ఇంట్లో నిద్రిస్తుండగా మెడలోని బంగారు సరుడును గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకెళ్లారని మండలంలోని పడమటిపాళెంకు చెందిన అయ్యప్ప అనే వృద్ధురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 15వ తేదీ ఇంట్లో నిద్రిస్తుండగా సరుడు లాక్కెళ్లారని, తనకు ఎవరూ లేకపోవడంతో ఫిర్యాదు చేయలేకపోయానని పేర్కొంది. ఈ విషయమై గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లానని, కొందరిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు తెలియజేసింది. చివరకు గ్రామ పెద్దల సూచన మేరకు ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించింది. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

సంగం: మండలంలోని పెరమనకు చెందిన ఓ యువతి డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. ఆమె సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదంటూ మంగళవారం తల్లిదండ్రులు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆమె తండ్రి ఇంట్లో నిద్రించి సాయంత్రం లేచి చూసే సరికి కనిపించలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధంగా ఉండాలి


- జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్


నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఫిబ్రవరిలో ప్రారంభం కానున్న ధాన్యం సేకరణకు పీఏసీఎస్ సంఘాలు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని జేసీ, డీసీసీబీ పర్సన్ ఇన్చార్జి కార్తీక్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో మంగళవారం మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) బలోపేతానికి డీసీసీబీ విరివిగా రుణాలు అందించాలని సూచించారు. పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఫిబ్రవరి నుంచి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా పీఏసీఎస్‌లు తమ కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశించారు. పీఏసీఎస్ సభ్యత్వం ఉన్న రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలని, డీసీసీబీ డిపాజిట్ల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ గురప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం డాక్టర్ బాబు, అధికారులు, పీఏసీఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 126
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 224
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 248
లేయర్ చికెన్ : 145

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

తమ్ముళ్ల ఇసుక దోపిడీ

పాతాళంలో భూగర్భ జలం

- వాగులు, వంకలను వదలని వైనం
- వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండుతున్న పంటలు.. ఆందోళనలో అన్నదాతలు

టీడీపీ నేతల ధనాశ.. భూగర్భ జలవినాశానికి దారితీస్తోంది. వాగులు, వంకల్లో రాత్రింబవళ్లు తేడా లేకుండా యంత్రాలతో ఇసుక తోడేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వేయడంతో వీటి పరీవాహక ప్రాంతాల్లోని భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. వాగులు, వంకలు ఆధారంగా పంటలు సాగు చేసిన రైతుల పొలాల్లోని బావుల్లో నీరు తగ్గిపోవడంతో సాగునీరందక పంటలు ఎండిపోతుంటే అన్నదాతలు బావురుమంటున్నారు.

జనవరిలోనే అడుగంటిన భూగర్భ జలాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు తాళ్లూరు రాజయ్య. ఇతనికి దుత్తలూరు మండలం తెడ్డుపాడులో 1.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పిల్లాపేరుకు ఆనుకుని ఉన్న ఈ భూమిలో బోరువెల్ ద్వారా వచ్చే నీటితో పైర్లు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో బోరు నుంచి వచ్చే నీటి ధార తగ్గిపోయింది. పిల్లాపేరులో ఇసుకను జేసీబీలతో తవ్వేయడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ఇసుక తీయక ముందు వేసవిలో కూడా బోరులో నీరు తగ్గలేదని, కానీ ఇప్పుడు జనవరిలోనే పరిస్థితి ఏర్పడిందని రైతు వాపోతున్నాడు.



వింజమూరు మండలం గోళ్లవారిపల్లి సమీపంలో వాగులో ఇసుకను జల్లెడ పట్టి సేకరిస్తున్న దృశ్యం

ఉదయగిరి: తమ్ముళ్ల ఇసుక దోపిడీకి ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ఇంకా వేసవి కాలం రాక ముందే ఇప్పటికే బావులు, బోర్లలో నీరు అడుగంటిపోయి.. జలధారాలు తగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజవర్గంలో మర్రివూట్ల వాగు, పిల్లాపేరు, మన్నేరు, ఉప్పుటేరు, ఉప్పువాగుల్లో జేసీబీలతో కుళ్ల బోడుస్తూ ట్రాక్టర్లు ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. వీటి పరీవాహక ప్రాంతాల్లో సాగు చేసిన వివిధ పంటలకు నీటి సమస్య ముప్పు పొంచి ఉంది. నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం మండలాల్లో టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న నేతలు పిల్లాపేరులో ఇసుక కోసం యంత్రాలతో తోడేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ పిల్లాపేరును ఖాళీ చేస్తున్నారు. ఇసుక తోడేయడంతో భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయో తెలిసినా.. అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. నెలవారీ మామూళ్ల మత్తులో పిల్లాపేరు గర్భశోకాన్ని పట్టించుకోవడం లేదు.

ఎక్కడెక్కడ.. ఎలా?

➡ సీతారామపురం మండలంలో సిద్దేశ్వరం అటవీ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న మర్రివూట్ల, పిల్లాపేరు వాగుల్లో ఇసుకను అక్రమార్కులు వదలడం లేదు. వీటి పరిధిలో ఉన్న దేవమ్మ చెరువు, బసినేనిపల్లి, పడమటి రొంపిదొడ్ల, నెమళ్లదిన్నె, పొలంగారిపల్లి ప్రాంతంలో జేసీబీలు ఉపయోగించి ఇసుకను ఖాళీ చేస్తున్నారు.

➡ ఉదగయగిరి మండలంలో ప్రవహిస్తున్న పిల్లాపేరులో పరీవాహక ప్రాంతం కృష్ణంపల్లి, జెట్టివారిపల్లి, గండిపాళెం, వెంగళరావు, ఉదయగిరి, తిరుమాలపురం, దున్నపోతుల వాగు ఉన్న శకునాలపల్లి, కుర్రపల్లిలో ఇసుక దోచేస్తున్నారు.

➡ వరికుంటపాడు మండలంలో కాంచెరువు, గువ్వాడి, చెన్నంపల్లి, జడదేవి, కనియంపాడు, రామదేవులపాడు, గణేశ్వరపురం సమీపంలో ఉన్న పిల్లాపేరు నుంచి నిత్యం యంత్రాలు ఉపయోగించి ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక సమీప వింజమూరు, పామూరు పట్టణాలకు తరలిస్తున్నారు. ఉప్పువాగు పరిధిలో తిమ్మారెడ్డిపల్లి, టి.కొండారెడ్డిపల్లి, తూర్పు రొంపిదొడ్ల, డక్కునూరు ప్రాంతంలో ఇసుక తరలిస్తున్నారు.

➡ వింజమూరు మండలంలోని జనార్దనపురం, చాకలికొండ, గోళ్లవారిపల్లి వద్ద ఉన్న పిల్లాపేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారు.

➡ కొండాపురం మండలంలో చల్లగిరిగల, గరిమెనపెంట, చల్లవారిపల్లి, కోవివారిపల్లి ప్రాంతంలో ఉన్న పిల్లాపేరు వాగు, మన్నేరు నుంచి పొట్టిపల్లి, ఇస్కదామెర్ల, మక్కెనవారిపల్లి, రేణుమాల ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా కొల్లగొట్టుతున్నారు. చింతలదేవి, కోకవారిపాళెం, భీమరప్పాడు, సాయిపేట, కొండాపురం, కొమ్మి తదితర ప్రాంతాల్లో ఉన్న వాగుల నుంచి కూడా ఇసుక తరలిపోతోంది.



వరికుంటపాడు నుంచి పామూరు వైపు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా

నిబంధనలు ఇలా...

స్థానిక అవసరాల కోసం సమీపంలో ఉన్న వాగులు, వంకలు నుంచి ఇసుక ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, ఆటోలు, మినీ ట్రక్కుల ద్వారా ఉచితంగా సరఫరా చేసుకునే అవకాశం కల్పించింది. యంత్రాలు వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ నిత్యం జేసీబీలు ఉపయోగించి అందిన మేరకు ఇసుక తోడేస్తున్నారు. స్థానిక అవసరాలకు కాకుండా పొరుగు మండలాలు, జిల్లాలకు తరలిస్తున్నారు. వాగుల నుంచి కేవలం 4 కి.మీ దూరం వరకు ఉన్న గ్రామాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయవచ్చు. అది కూడా స్థానిక సచివాలయాల ద్వారా అనుమతి తీసుకోవాలి. కానీ అలా కాకుండా అక్రమార్కులు ఇసుక తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు.

వేగంగా పడిపోతున్న భూగర్భ జల మట్టం

వాగుల్లో ఉన్న నీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి సుమారు 20 వేల ఎకరాలు వరకు వివిధ పైర్లు సాగు చేస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది చిన్న, సన్న కారు రైతులే ఉన్నారు. ముఖ్యంగా వరి, కర్రపుచ్చ, మొక్కజొన్న, సజ్జ, మినుము తదితర పంటలు సాగులో ఉన్నాయి. ఇసుక నిల్వలు ఎక్కువగా ఉంటే భూగర్భ జలం అందుబాటులో ఉంటుంది. దీంతో వేసవిలో కూడా బోర్లు, బావుల్లో నీటి కొరత ఉండదు. కానీ ఇసుక తోడేస్తే కేవలం మట్టి పొరలు బయటపడి నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదు. దీంతో మార్చిలోనే బోర్లుల్లో నీరు లభ్యత ఉండక ఎండిపోయే అవకాశం ఉందని, ప్రస్తుతం సాగులో ఉన్న పైర్లు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొండాపురం మండలం మన్నేరు నుంచి ఇసుక తీస్తున్న దృశ్యం

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



ఉదయగిరి, సీతారామపురం తదితర మండలాల్లో ఉన్న పిల్లాపేరు వాగు నుంచి నిత్యం అక్రమంగా వాహనాల ఇసుక రవాణా చేస్తున్నారు. వాగులో ఇసుక ఖాళీ అయి భూగర్భ జలాలు పడిపోతున్నాయి. పిల్లాపేరు పరీవాహక ప్రాంతంలో రైతులు సాగు చేసే పైర్లకు సాగు నీటి సమస్య తలెత్తుతోంది. పైర్లు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి. ఇసుక లోడు తున్న జేసీబీలపై కేసు నమోదు చేయాలి.

– కాకు వెంకటయ్య, సీపీఎం నేత

ముగిసిన అంతర్ కళాశాలల పురుషుల క్రీడల టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్ కళాశాలల పురుషుల క్రీడల పోటీలు మంగళవారంతో ముగిశాయి. వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. బాస్కెట్ బాల్‌లో జేబీ డిగ్రీ కళాశాల (కావలి) విన్నర్‌గా, రన్నర్‌గా వీఎస్‌యూ కళాశాల (కావలి), చెస్‌లో జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల (నెల్లూరు) విన్నర్‌గా, వీఎస్‌యూ కళాశాల (కాకుటూరు) రన్నర్‌గా, సాఫ్ట్‌బాల్‌లో డాక్టర్ ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల (ఆత్మకూరు) విన్నర్‌గా, వీఎస్‌యూ కళాశాల (కాకుటూరు) రన్నర్‌గా, హ్యాండ్ బాల్‌లో జేబీ డిగ్రీ కళాశాల (కావలి) విన్నర్‌గా, వీఎస్‌యూ కళాశాల (కాకుటూరు) రన్నర్‌గా, ఉత్తమ శరీరాకృతి (బెస్ట్ ఫిజిక్)లో వీఎస్‌యూ కళాశాల (కాకుటూరు) విన్నర్‌గా, జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల (నెల్లూరు) రన్నర్‌గా నిలిచారు. పోటీల్లో విజేతలకు వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్ రావు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, టోర్నమెంట్ నిర్వాహకులు డాక్టర్ పి.నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



చెక్కనగిషీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

ఉదయగిరి: ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారిణి నాగరాజకుమారి తెలిపారు. ఉదయగిరిలోని దిలావర్‌బాయి వీధిలో ఉన్న చెక్కనగిషీ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. కేంద్రంలో వసతులు, కళాకారులతో చెక్కబడిన వివిధ రకాల ఉపకరణాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర నిర్వాహకులు గౌసియాబేగం, జాకీర్‌హుస్సేన్‌తో కేంద్ర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్‌లో భాగంగా ఉదయగిరి చెక్కనగిషీ వస్తువుల మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం నుంచి సాయంపై ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రంలో వీలైనంత వరకు ఎక్కువ మందికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన భవనం మంజూరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉల్లాసంగా.. ఉల్లాస్..

స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన ఉల్లాస్‌లో ఆమె పాల్గొన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలపై ఈఓఏలు, వలంటీర్లతో సమీక్షించారు. వలంటీర్లు ప్రతి రోజూ కేంద్రాలను నిర్వహించి పుస్తకాల ద్వారానే కాకుండా వీడియోల ద్వారా కూడా అవగాహన కల్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం పొదుపు మహిళలకు రాయితీతో పీఎం సూర్య ఘర్ పథకాన్ని వర్తింపజేస్తున్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.25వేలకు పాపను అమ్మేసిన కసాయి తండ్రి

- బాతులు మేపుతూ వెట్టిచాకిరి చేస్తున్న చిన్నారి
- రాత్రి వేళ పారిపోతుండగా కాపాడిన గ్రామస్తులు
- ఆర్కేపేట పోలీసుల విచారణ

పళ్లిపట్టు: పాతిక వేలకు కన్న తండ్రే తన పదేళ్ల కుమార్తెను అమ్మేశాడు. కొనుక్కున్న వ్యక్తి ఆ చిన్నారితో బాతులు మేపే వెట్టిచాకిరి పనులు చేయిస్తుండగా, రాత్రి సమయంలో పారిపోయేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు రక్షించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన ఆర్కేపేట ప్రాంతంలో సోమవారం రాత్రి జరిగింది. నెల్లూరు జిల్లాకు చెందిన రమణయ్య దంపతులకు 10 మంది పిల్లల్లో ముగ్గురు కుమారులు, ఏడుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద అమ్మాయికి 27 ఏళ్లు కాగా, చిన్న పాపకు రెండేళ్లు. రమణయ్య భార్య అనారోగ్యం బారిన పడినట్లు తెలుస్తోంది. దీంతో పిల్లలను తిరుపతికి తీసుకొచ్చి భిక్షాటనకు పెట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా నగరికి చెందిన బాలాజీ తిరుత్తణి శివారులో బాతులు మేపుకొంటూ ఉండే సమయంలో రమణయ్యతో పరిచయం ఏర్పడింది. బాతులు మేపేందుకు వీలుగా తన ఐదో కూతురు మల్లిక (10)ను తీసుకెళ్లమని, అందుకు తనకు రూ. 25 వేలు ఇవ్వాలని అడిగినట్లు, అందుకు అంగీకరించిన బాలాజీ రూ. 25 వేలు ఇచ్చి బాలికను తీసుకెళ్లాడు. నగరిలో కొద్ది రోజులు బాతులు మేపిన తర్వాత తమిళనాడులోని పళ్లిపట్టు సమీపం ఆర్కేపేట మండలంలోని మీసరగాండాపురం చెరువు కట్ట వద్ద టెంటు వేసి బాతులు మేపుకుంటున్నారు. వారితో ఉన్న చిన్నారి సోమవారం రాత్రి సమయంలో కేకలు వేస్తూ సమీపంలోని గ్రామంలోకి పరుగులు తీసింది. గ్రామస్తులు చిన్నారిని రక్షించి పోలీసులకు అప్పగించారు. ఆర్కేపేట పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారిని తిరువళ్లూరులోని చిన్నారుల సంక్షేమ వసతిగృహానికి తరలించారు. స్థానిక డీఎస్పీ కేసు విచారణ చేస్తున్నారు.

జేసీ సంతకం ఫోర్జరీ

- నెల్లూరు రూరల్ తహసీల్దార్ ఫిర్యాదు
- ఐదుగురిపై పోలీసుల కేసు నమోదు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు జాయింట్ కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ప్రొసీడింగ్స్ తయారు చేసిన నిందితులపై దర్గామిట్ట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరురూరల్ మండలం కనుపర్తిపాడులోని ఓ సర్వే నంబర్‌లో 4.25 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాలు సక్రమంగా లేనందున్న వాటిని సరిదిద్దాలని జయప్రసాద్‌రావు, సురేష్ అనే వ్యక్తులు ఇటీవల నెల్లూరు రూరల్ తహసీల్దార్ లాజరస్‌ను కలిసి నెల్లూరు జాయింట్ కలెక్టర్ పేరిట ఉన్న ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. తహసీల్దార్ ప్రొసీడింగ్స్ ఫైల్ నంబర్‌ను పరిశీలించగా అది జనన ధ్రువీకరణ పత్రానికి సంబంధించినదిగా తేలింది. నకిలీ ప్రొసీడింగ్స్‌గా గుర్తించిన తహసీల్దార్ మరింత లోతుగా వివరాలు సేకరించారు. 4.25 ఎకరాల భూమిని కాజేసేందుకు ధనుంజయ్, చంద్రశేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు కోవూరు కు చెందిన మహేంద్ర అనే వ్యక్తికి రూ.8 లక్షల నగదు ఇచ్చి జేసీ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ప్రొసీడింగ్స్‌ను తయారు చేయించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఆయన ఈ విషయాన్ని జేసి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు తహసీల్దార్ లాజరస్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పోలీసులు నకిలీ ప్రొసీడింగ్స్ తయారు చేసిన, తయారు చేయించిన వారందరిపై కేసు నమోదు చేశారు.

జైలు సూపరింటెండెంట్‌పై ఆరోపణల వెల్లువ

- రోజుకో ఆడియో వైరల్

నెల్లూర(క్రైమ్): నెల్లూరు కేంద్ర కారాగార సూపరింటెండెంట్ రాజారావు అవినీతిపై రోజుకో ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. సూపరింటెండెంట్ రాజారావుతో పాత ఖైదీ రాకేష్ మాట్లాడుతున్నట్లు ఉన్న ఆడియో రికార్డులు ఇటీవల వైరల్ అయిన విషయం విదితమే. తాజాగా మంగళవారం మరో వ్యక్తి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్నట్లు ఉన్న ఆడియో రికార్డులు సోషల్ మీడియాల్లో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. 'ఖైదీకి అన్నీ సౌకర్యాలు కల్పించేందుకు నగదు ఇస్తారని, ఇలా రెండు, మూడు విషయాలు చేశానని, జైల్లో మహిళా ఖైదీలు ఒకరిద్దరు అందంగా ఉంటారని, కొందరు మేకప్ వేసుకుంటారని, రాజమండ్రిలో ఉన్న సమయంలో మంచి అందగత్తెలు ఉండేవారని, ఇక్కడున్న వారంతా తొట్టి గ్యాంగ్ అని, జిల్లాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధిని దుర్భాషలాడిన ఓ ఆడియో రికార్డు వైరల్ అవుతోంది. ఇప్పటికే సదరు ఆడియో రికార్డుల్లో ఉన్న వాయిస్ తనది కాదని, ఈ విషయాల్లో విచారణ చేయాలని తానే ఉన్నతాధికారులను కోరినట్లు రాజారావు వెల్లడించిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై రాష్ట్ర హోంమంత్రి స్పందించి విచారణకు ఆదేశించారని సోషల్ మీడియాల్లో చక్కర్లు కొడుతోంది. కావాలని కొందరు జైలు సూపరింటెండెంట్‌పై ఈ విధంగా చేస్తున్నారా? లేదా అనేది విచారణలో తెలియాల్సి ఉంది. జైలు ఉన్నతాధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.